క్లుప్తంగా

ఆధునిక వైద్యంతో నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణకు అనేక ఆధునిక చికిత్సా పద్ధతులు వచ్చాయని, వాటిని వినియోగించడం ద్వారా శిశువులను ఆరోగ్యంగా ఎదిగేలా చేయవచ్చునని అను మై బేబీ ఆసుపత్రి వైద్య నిపుణులు స్పష్టం చేశారు. స్థానిక ఆర్‌ఆర్ పేట ఆకర్ష్ ఫ్రైడ్ సమావేశ మందిరంలో ఆదివారం కంటిన్యూఇంగ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీడియాట్రిక్, గైనకాలజీ ఎడ్యుకేషన్‌పై జిల్లాలోని వైద్యులకు అను మై బేబీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ గాజుల రమేష్, ఏలూరు ఐఎంఏ డాక్టర్స్ ఆధ్వర్యంలో సంయుక్తంగా అవగాహన సదస్సు నిర్వహించారు. బేబీ కేర్, గర్భిణుల విషయాలలో ఎదురయ్యే సమస్యలపై వారి వారి అనుభవాలను అత్యాధునిక టెక్నాలజీని తెలియజేస్తూ, తీసుకోవలసిన జాగ్రత్తలపై వివరించారు. ఈ సదస్సులో సుమారు 200 మంది వైద్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అను గ్రూప్ హాస్పిటల్స్ డైరెక్టర్స్ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ దుర్గా నాగరాజు, డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం



శిబిరంలో ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని హేలాపురి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు, డాక్టర్ ఎంబీఎస్ శర్మ అన్నారు. స్థానిక విజయ గార్డెన్స్‌లోని హేలాపురి బ్రాహ్మణ సంఘ భవనంలో ఆ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. నగరానికి చెందిన ప్రముఖ వైద్య నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో దాదాపు 1000 మంది పరీక్షలు చేయించుకున్నారు. వారిలో అవసరమైన వారికి గురుప్రసాద్ మిశ్రా ఆధ్వర్యంలో సుమారు రూ.1.50 లక్షల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి ఎం.భానుమూర్తి, కోశాధికారి ద్రోణం రాజు వెంకట సుబ్బారావు, మెడికల్ క్యాంపు కన్వీనర్ ఎంఎన్ శర్మ, సభ్యులు మద్దాలి భాస్కర శ్రీనివాస్ నాగరాజు, పాలంకి దుర్గా ప్రభాకరం, తమ్మెర రామారావు, కందుకూరి వెంకట సీతారామాంజనేయ శర్మ, తూములూరి విశ్వనాథ శాస్త్రి, మైలవరపు గురుశర్మ, ఏలూరు బ్రాహ్మణ ఐక్య కార్యాచరణ సమితి కార్యదర్శి తురగా రామకృష్ణ, రామచంద్రరావుపేట శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం చైర్మన్ తోలేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- పదో తరగతి పరీక్షలపై ప్రత్యేక కార్యాచరణ
- బీ గ్రేడ్ విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు
- సీ, డీ గ్రేడ్‌ల విద్యార్థులకు స్టడీ అవర్స్
- పది మంది విద్యార్థుల చొప్పున ఉపాధ్యాయులకు దత్తత

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రానున్నది పరీక్షల కాలం .. ముఖ్యంగా విద్యార్థుల ఉన్నత విద్యకు తొలిమెట్టు లాంటి పదవ తరగతి దాటడమే పెద్ద పరీక్ష.. అందులోనూ ఇటీవలి కాలంలో కోవిడ్ మహమ్మారితో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు క్షీణించిన నేపథ్యంలో గత ఏడాది పదవ తరగతి ఫలితాలు ఆశాజనకంగా లేకపోవడం ఉపాధ్యాయులను, విద్యాశాఖ అధికారులను తీవ్రంగా కలవరపెట్టింది. ఈ ఏడాది ప్రతికూల ఫలితాలు రాకుండా చూడాలనే పట్టుదల అటు అధికారుల్లోను, ఇటు ఉపాధ్యాయుల్లోనూ బలం పుంజుకుంది. దీనితో ఎలాగైనా నూటికి నూరు శాతం మంచి ఫలితాలు రాబట్టాలనే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకుని అమలుకు శ్రీకారం చుట్టారు. ఏలూరు నియోజకవర్గ పరిధిలో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టేలా విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులను సమాయత్తం చేశారు.

సీ, డీ గ్రేడుల విద్యార్థులకు స్టడీ అవర్స్

ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకూ నిర్వహించిన సమ్మెటివ్, ఫార్మేటివ్ పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులు, వారి ప్రదర్శన ఆధారంగా విద్యార్థులను ఏ, బీ, సీ, డీ గ్రేడులుగా విభజించారు. వారిలో సీ, డీ గ్రేడుల విద్యార్థులు సైతం ఉత్తీర్ణత సాధించేలా వారిని సానపెట్టడానికి పూనుకున్నారు. ఈ మేరకు పాఠశాల రెగ్యులర్ తరగతులు ముగిసిన అనంతరం సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకూ వారికి స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ప్రతి సబ్జెక్టులో వారు పట్టు సాధించేలా శిక్షణ కొనసాగిస్తున్నారు.

పదేసి మంది విద్యార్థుల దత్తత

పదవ తరగతిలో మరింత ఉత్తమ ఫలితాలు సాధించడానికి నియోజకవర్గంలోని ప్రతి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సైతం స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. ప్రతి ఉపాధ్యాయుడూ 10 మంది విద్యార్థులను దత్తత తీసుకున్నారు. ఇకపై వారి ఉత్తీర్ణత బాధ్యతలు వారివే అన్నంతగా వారి శక్తులను వినియోగిస్తున్నారు. వారి బోధనానుభవాన్ని అంతా రంగరించి విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల్లో అనుమానాలను నివృత్తి చేస్తూ మార్గదర్శనం చేస్తున్నారు. దీనితో విద్యార్థుల అభ్యసనపై స్పష్టమైన పర్యవేక్షణ లభించినట్లయింది. అలాగే బీ గ్రేడ్ విద్యార్థులకూ ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. విద్యార్థులకు ఎటువంటి సందేహాలు ఎదురైనా వారికి అర్థమయ్యే రీతిలో నివృత్తి చేస్తున్నారు.

తల్లిదండ్రులకూ బాధ్యత

విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడానికి తల్లిదండ్రుల బాధ్యతా అవసరమేనని విద్యాశాఖ అధికారులు గ్రహించారు. ఈ మేరకు విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయడంలో తల్లిదండ్రులను భాగస్వాములను చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పిన ముఖ్యమైన ప్రశ్నలను ఇంటివద్ద చదివించాలని సూచించారు. అలాగే ఉదయం 5 నుంచి 7 గంటల వరకూ విద్యార్థులు చదువుకునేలా తల్లిదండ్రులను అప్రమత్తం చేస్తున్నారు. పాఠశాలలో చదువుతో పాటు ఇంటి వద్ద కూడా చదవడం వల్ల మెరుగైన ఫలితం సాధించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇది కేవలం ప్రభుత్వ రంగ విద్యా సంస్థలకే కాక ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో కూడా అమలు చేయాలని సూచించడంతో ఆయా ప్రైవేట్ పాఠశాలల్లో కూడా ఈ కార్యాచరణను అమలు చేస్తున్నారు.

నియోజకవర్గంలో 3298 మంది విద్యార్థులు

ఏలూరు నియోజకవర్గంలో ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలకు 3298 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో ఏలూరు అర్బన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలలు 15 ఉండగా వాటిలో 1380 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు సిద్ధమౌతున్నారు. అలాగే ఏలూరు రూరల్ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్, అన్ ఎయిడెడ్ యాజమాన్యాల్లో 31 పాఠశాలలు ఉండగా ఆయా పాఠశాలల నుంచి 1918 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.



విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వారి అభ్యసనను పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయుడు

అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపడుతున్నాయి



పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించాలనే కసితో ఈ ఏడాది ఉపాధ్యాయులు పని చేస్తూ ఉండడం అభినందనీయం. వారు అంకితభావంతో కృషి చేస్తుండడంతో ఈ ఏడాది జిల్లా రాష్ట్ర స్థాయిలో తన స్థానాన్ని మరింత మెరుగుపరుచుకుంటుందని నమ్మకం కలుగుతోంది. విద్యాశాఖ అధికారులు నిర్దేశించిన కార్యాచరణ ప్రణాళికను తూ.చ. తప్పకుండా అమలు చేస్తున్నారు. ఈ ప్రణాళికతో ఫలితాల్లో స్పష్టమైన ప్రభావం కనిపించబోతోంది.

– గెద్దం సుధీర్, వైఎస్ఆర్ టీఎఫ్ రాష్ట్ర నాయకుడు.

10/10పై ప్రత్యేక దృష్టి



ఈ ఏడాది 10వ తరగతి ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించడానికి జిల్లా విద్యాశాఖాధికారి నిర్దేశించిన కార్యాచరణ ప్రణాళిక ఒక చక్కని వేదికగా నిలుస్తుంది. కేవలం ఫలితాలపై మాత్రమే కాక అధికశాతం మంది విద్యార్థులు 10/10 సాధించడంపై ఏలూరు నియోజకవర్గంలోని ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు కృషి చేస్తున్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కూడా ఈ యజ్ఞంలో మనస్ఫూర్తిగా భాగస్వాములౌతుండడంతో ఆశించిన దానికంటే మంచి ఫలితాలు సాధిస్తామనే విశ్వాసం ఉంది.

– నబ్బితి నరసింహమూర్తి, ఏలూరు మండల విద్యాశాఖాధికారి

వృద్ధులకు కంటి పరీక్షలు



వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్ : ఏలూరు 15వ డివిజన్ మునిసిపల్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సలాది లక్ష్మీనరసింహ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాజమండ్రి శ్రీపరమహంస యోగానంద నేత్ర వైద్యశాల సౌజన్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యులు వృద్ధులకు కంటి పరీక్షలు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కార్పొరేటర్ తంగెళ్ల రాము చేతుల మీదగా రోగులకు కళ్లజోళ్లు, మందులు ఉచితంగా అందజేశారు. కొందరికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. వీరికి త్వరలో ఉచితంగా శస్త్ర చికిత్స చేస్తామని నిర్వాహకులు సలాది విశ్వనాథం వెల్లడించారు. కార్యక్రమంలో వీవీ సురేంద్రగుప్త, సలాది సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : నగరంలోని అగ్రహారంలో వేంచేసియున్న శ్రీ జనార్ధన స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారి రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టీ.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఏలూరు కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలోని మెయిన్ బజారు, అగ్రహారం, న్యూ మార్కెట్, గజ్జెలవారి చెరువు ప్రాంతం, గడియార స్తంభం ప్రాంతం, కుండీ సెంటర్, పెరుగుచెట్టు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

ఏలూరు టౌన్ : సీఎం సహాయనిధి పేదలకు వరం అని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళ నాని అన్నారు. సీఎం సహాయనిధి నుంచి ముగ్గురు బాధితులకు ఆదివారం స్థానిక శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో రూ.14.10 లక్షల ఆర్థిక సహాయాన్ని ఆయన అందజేశారు. ఏలూరు నగరం 28వ డివిజన్ తంగెళ్ళమూడికి చెందిన గొర్రెల హేమంత్ (6), 40వ డివిజన్ చేపల తూము సెంటర్ ప్రాంతానికి చెందిన బుసర మోజెస్ (9) అనే ఇద్దరు చిన్నారులు పుట్టుకతోనే మాట్లాడలేక, వినికిడి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి తల్లిదండ్రులు స్థానిక కార్పొరేటర్లకు సమస్యను తెలియజేయగా వారు ఎమ్మెల్యే ఆళ్ళనాని దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నాని .. ప్రత్యేక శ్రద్ధతో ఇద్దరు చిన్నారులకు కొచెలియర్ ఇంప్లాంట్ సర్జరీ చేసేందుకు ఇద్దరు చిన్నారులకు చెరొక రూ.5.30 లక్షల చొప్పున రూ.10.60 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేసిన అనుమతి పత్రాలను వారికి అందజేశారు. అలాగే ఏలూరు వన్‌టౌన్ 11వ డివిజన్ దక్షిణపువీధిలో లివర్ సమస్యతో బాధపడుతున్న వట్టి నాగవెంకట ఆంజనేయులుకు రూ.3.50 లక్షల సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, పార్టీ నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, కార్పొరేటర్ తుమరాడ స్రవంతి, నాయకులు కోయ సత్తిబాబు, కొల్లిపాక సురేష్ తదితరులు ఉన్నారు.



చిన్నారుల ఆపరేషన్లకు సీఎంఆర్‌ఎఫ్ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్

జగనన్నతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు

ఏలూరు టౌన్ : ఆంధ్ర రాష్ట్రానికి దశదిశా నిర్దేశం చేస్తూ... రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేస్తోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసలైన విజనరీ అని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎమ్మెల్యే, విప్ ముదునూరి ప్రసాదరాజు కుమార్తె వివాహ రిసెప్షన్ వేడుకలకు వచ్చిన సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ఆదివారం శ్రీలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ... గతంలో చంద్రబాబు తాను విజనరీ అంటూ చెప్పుకుంటూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారని ఆరోపించారు. నిజంగా ఆయనకు విజన్ ఉంటే తాత్కాలిక కట్టడాలు కట్టి రాజధాని అని చెప్పేవారు కాదన్నారు. రెండు పంటలు పండే వేలాది ఎకరాలను బలవంతంగా లాక్కుని, సింగపూర్, అమెరికా అవుతుందంటూ కల్లబొల్లి కబుర్లు చెప్పి చివరికి మోసం చేశారని విమర్శించారు. రెండు రోజుల పాటు విశాఖపట్నం మహానగరంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహించి ఏకంగా రూ.13లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించటం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందన్నారు. దేశంలోని పారిశ్రామిక దిగ్గజాలు సైతం ఏపీవైపు చూస్తున్నాయంటే జగనన్న శక్తిసామర్థ్యాలపై అపారమైన నమ్మకంతోనే అన్నారు. రాబోయే ఐదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో దూసుకుపోయేలా ప్రత్యేక ప్రణాళిక, లక్ష్యంతో ఆయన పనిచేస్తున్నారని తెలిపారు. రాబోయే రెండు, మూడేళ్లలో ఏపీలో ఉద్యోగాల విప్లవం రాబోతుందనీ, ప్రపంచంలోనే టాప్ 20లో అగ్రగామిగా నిలిచే ముఖేష్ అంబానీ సైతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలోని విజన్‌ను గుర్తించారని అన్నారు. టీడీపీ జనసేన ఇతర రాజకీయ పక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా 2024లో మరోసారి ముఖ్యమంత్రిగా జగనన్న అధికారంలోకి వస్తారని ధీమా వ్యక్తం చేశారు.



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	26	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	22	దొక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	26	ములక్కాడలు	10-12
బెండకాయలు	48	కంద	40
పచ్చిమిర్చి	32	బీట్‌రూట్	34
కాకర కాయలు	30-36	కీరా దోస	40
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	60
బీరకాయలు (పందిరి)	60	అల్లం	70
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	40	చుక్కకూర	08
బంగాళదుంపలు	18	తోటకూర	08
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	30	బఠాణీ	50
ఆనపకాయ (1)	20	క్యాప్సికమ్	58
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	25

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	16
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	24
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	33
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	22
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	33
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

తాటాకిల్లు దగ్ధం.. బాధితులకు ఆర్థిక సహాయం

బుట్టాయగూడెం : పడమర రేగులకుంట గ్రామంలో ఆదివారం సంభవించిన అగ్నిప్రమాదంలో బరగడ సురేష్, సారాలమ్మకు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. వంట చేస్తుండగా ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగి ఇంట్లోని సామాగ్రితో సహా తాటాకిల్లు పూర్తిగా దగ్ధం కావడంతో వారు నిరాశ్రయులయ్యారు. సుమారు రూ.లక్షా 50 వేలు ఆస్తినష్టం వాటిల్లినట్లు చెప్పారు. బాధితులను ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొవ్వాసి నారాయణ, సర్పంచ్ తెల్లం జయమ్మతో పాటు పార్టీ శ్రేణులు పరామర్శించి వారికి ఆర్థిక సహాయం అందజేశారు. బియ్యం, దుప్పట్లు, దుస్తులు, నిత్యావసర సరుకులు అందజేశారు. మండల సచివాలయ కన్వీనర్ సింహాచలం, యాంద్ర రవి, కొవ్వాసి వెంకటేశ్వరరావు, బాడిశ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు. కాగా బాధితులకు రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. రూ. 5 వేల నగదు, 20 కేజీల బియ్యం, పంచదార, కందిపప్పు, తదితర వస్తువులను తక్షణ సహాయంగా అందజేశారు.

కేంద్రీయ విద్యాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగాలు

దెందులూరు: గోపన్నపాలెంలోని కేంద్రీయ విద్యాలయాల్లో 2023-24 విద్యా సంవత్సరానికి అన్ని టీచింగ్ పోస్టులకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేస్తామని ప్రిన్సిపల్ ఎస్.నాగేంద్ర తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఇంగ్లీష్, హిందీ మీడియంలో బోధించే సామర్థ్యం ఉన్నవారందరూ ఈ నెల 7న ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు నిర్వహించనున్న ఇంటర్వ్యూకు హాజరుకావాలని తెలిపారు. అర్హత వివరాలు స్కూల్ ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని కోరారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి : మహిమ గల తల్లి రాట్నాలమ్మకు సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలో కొలువైన అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వారం అమ్మవారికి పూజా టికెట్లపై రూ.39,305, విరాళాలు రూ 48,109, లడ్డూ ప్రసాదం విక్రయాల ద్వారా రూ. 29,760, ఫొటోల అమ్మకంపై రూ. 635, మొత్తం రూ. 1,17,809 ఆదాయం లభించిందని దేవస్థాన చైర్మన్ చళ్లగొళ్ళ వెంకటేశ్వరరావు తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పన్నుల వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్

ఏలూరు టౌన్: నగరంలో పన్నుల వసూళ్లపై నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఆదివారం నగరంలోని వన్‌టౌన్ ప్రాంతంలో పన్ను బకాయిలు అధికంగా ఉన్న ఇళ్లకు కుళాయి కనెక్షన్ నిలిపివేశారు. వన్‌టౌన్ మార్కెట్ ప్రాంతంలో అద్దెలు చెల్లించని కార్పొరేషన్ షాపులకు తాళాలు వేశారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం ఆదివారం కూడా పన్నులు కట్టించుకునేలా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన పన్నులను ప్రజలు సకాలంలో చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని ఏలూరు కార్పొరేషన్ రెవెన్యూ ఆఫీసర్-1 ఆర్.అరుణ కోరారు. స్పెషల్ డ్రైవ్‌లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంబూరి రవి, బిల్ కలెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. కాగా ఏడాదంతా పన్నుల చెల్లింపులపై దృష్టి సారించని రెవెన్యూ సిబ్బంది ఆకస్మికంగా కొరఢా ఝుళిపిస్తూ కుళాయి సర్వీసు కట్ చేయటంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతుంది. ప్రజలకు ముందుగా పన్నుల చెల్లింపులపై అవగాహన కల్పిస్తూ సకాలంలో పన్నుల చెల్లించేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత రెవెన్యూ యంత్రాంగంపై ఉండగా ఆర్థిక సంవత్సరం అంతా ఉదాసీనంగా వ్యవహరించి హఠాత్తుగా చర్యలకు ఉపక్రమించడంపై ప్రజల్లో భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో ఇంటి కుళాయి కనెక్షన్ సర్వీస్ కట్ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

వైభవంగా కల్యాణ మహోత్సవం



స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చక స్వాములు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : స్థానిక అగ్రహారంలోని శ్రీ భూ, నీళా సమేత శ్రీ జనార్ధన స్వామి దేవస్థానంలో శ్రీ జనార్ధన, శ్రీ రంగనాయక స్వామి వార్ల కల్యాణ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన జరిపారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణ చేసి భక్తుల గోత్ర నామాలతో అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామి వార్లకు, అమ్మవార్లకు ఎదుర్కోలు ఉత్సవం భక్తుల సమక్షంలో ఉత్సాహంగా నిర్వహించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో స్వామి వార్ల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిపించారు. ఆలయ అర్చకుడు వంగల పవన్ కుమార్ ఆచార్య విశేష పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్ల రావు కార్యక్రమాలు పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని కన్నులారా తిలకించి భక్తిపారవశ్యం చెందారు.

వాసుదేవునికి ప్రత్యేక పూజలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పవర్‌పేటలోని శ్రీ దేవి, భూదేవీ సమేత శ్రీ వాసుదేవస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారి కల్యాణ మహోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రారంభమైంది. ఉదయం 8.45 గంటలకు స్వామివారిని పెండ్లి కుమారునిగా, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలను చేశారు. సాయంత్రం 5.30 గంటల నుంచి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ పూజలు నిర్వహించి అఖండ దీపారాధన చేశారు. అనంతరం అంకురార్పణ, మండపారాధన, అగ్ని ప్రతిష్టాపన, నిత్య హోమాలు, ధ్వజారోహణ, బలిహరణ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి, అమ్మవార్లకు విశేష అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు కందుకరి వేంకట విజయకుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. రామాంజనేయులు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

భీమడోలు: భీమడోలు జంక్షన్‌లో నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు, మరమ్మతులు చేపడుతున్న కారణంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు భీమడోలు ఏడీఏ కె.గోపాలకృష్ణ ఆదివారం రాత్రి చెప్పారు. భీమడోలు, పోలసానిపల్లి పంచాయతీల పరిధిలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

9న సీపీఆర్‌పై ఉచిత శిక్షణ

కొయ్యలగూడెం : సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిసిస్కిటేషన్)పై శిక్షణ కార్యక్రమం ఈ నెల 9వ తేదీ నిర్వహిస్తున్నట్లు జగనన్న సచివాలయ మండల కోఆర్డినేటర్ నూకల రాము పేర్కొన్నారు. ఆదివారం జంగారెడ్డిగూడెం రోడ్‌లోని జ్యూస్ సెంటర్ కాంప్లెక్స్ వద్ద వైఎస్సార్ సీపీ యూత్ నాయకుడు సనమండ్ర మధుకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో పరింపూడి పరిధిలోని నాలుగు సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులకు ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుత రోజుల్లో గుండె సంబంధిత మరణాలు ఎక్కువగా సంభవిస్తుండడంతో ప్రాథమిక చికిత్సకు సహకరిస్తుందనే ఉద్దేశంతో ఈ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.